


'ఈ తగుపులాట, మరి తెల్లారదు కాబోలు' అనుకున్నాడులా ఉంది.. ఇంజను ఆపేశాడు డ్రయివరు

నాకు చెడ్డ చిరాకువేసింది సినిమాకి వెళ్దామనుకున్నాను, టైము కూడా చాలదు సినిమాని మొదట్నించీ మరీ దయచేసి చూడమని, పాపం సినిమావాడు రిక్వెస్టు చేసేడు

సరే, తగువులాటకి కారకులెవరో చూద్దామనిపించింది. 'చేతులు బయట పెట్టరాదు' అని, మీద రాసున్న కిటికీ లోంచి తల బయటపెట్టి చూసేను.

ముగ్గురు మనుషులు బస్సు ఫుట్‌బోర్డుమీద నించున్నారు వాళ్ళని దిగమనీ, టయిమయిపోతోందనీ చెప్తున్నాడు కండెక్టరు వాళ్ళు ముగ్గురిలో

వొకాయన బాగా లావుగా ఉన్నాడు. ఒకచేత్తో బస్సు కడ్డీ పట్టుకుని, మరో చేతిని గాలిలో ఆడిస్తూ, కండక్టరుతో అతనిలా అన్నాడు, "దిగ(వయ్యా! మేం దిగం నీకు అంత కష్టంగా ఉంటే, లాగెయ్ నన్ను జబ్బపట్టుకుని."

"నే నెందుకు లాగేస్తాను బాబూ! మర్యాదగా దిగిపోండి సార్" అన్నాడు కండక్టరు మర్యాదగా

"ఇదుగో గురూ! మర్యాదా, గిర్యాదా నా దగ్గిర చెప్పకు. ముందు వాళ్ళని దింపు. మేము దిగుతాం. న్యాయం వుండొద్దుటయ్యా? కాళీ లేదన్న వాడివి, వాళ్ళని ఎలా ఎక్కించేవు? ముందు మేం ఆ గేటు దగ్గరకు వొస్తే, కాళీ లేదన్నావు పోనీ కదా అని, ఈ గేటుదగ్గరకు వొస్తే, ఈ లోపుని ఆ గేటులోంచి లేడీస్ ని ఎక్కించేస్తావా? అందరికీ వొకటేనయ్యా రూల్సు. ఏం? అవునా?" అన్నాడు ఆ లావుపాటి పెద్దమనిషి.

"ఇదుగో, కండక్టరూ! పోనీ ముగ్గురే కదా, వాళ్ళని ఎక్కనీ"- ఈ మాటలు బస్సులోంచి వచ్చేయి. ఎవరా ఈ పరోపకారపరాయణుడు, అని వెనక్కి తిరిగి చూసేము. అతణ్ణి వెంటనే గుర్తుపట్టేశాను. చిరునవ్వు నవ్వుతూ, కొంచెం గర్వం ప్రదర్శిస్తున్నా డతను.

"మీ కేటి బాబూ! మీరు చెప్తారు-ఎక్కించవయ్యా అని ముందు చెకింగుంది. ఆడ - దారిలో కూచున్నాడు మా మొగుడు. అసలే, నిన్నా మొన్నా ఏక్సిడెంట్లు తెగ జరిగిపోయేయి కదా! అందుకే, వొక్కణ్ణి ఎగస్ట్రా ఎక్కించినా ఫయిన్ వేస్తాడు- ఏటవుతుందంటే, బాబూ! ఆడు ఉన్నాడని తెలిసి మరీ వోవరులోడు ఎక్కిస్తే, ఆణ్ణి ఎక్కరించినట్టవుద్ది. మాకు మాత్రం డబ్బు లొస్తాయంటే కాదా, శెప్పండి. - నా మాట విని దిగిపోండి బాబూ! ప్లీజ్" అన్నాడు కండక్టరు అప్పుడు కండక్టరు మొహంలో దైన్యం కనిపించింది నాకు.

"ఆఁ మరేం ఫర్వాలేదు ఎక్కించవయ్యా! వోవరులోడులో రోజూ పోతావు. చూసినవాడు లేడు. అడిగినవాడు అంతకంటే లేడు. ఇవాళ నువ్వు పెద్ద కబుర్లు చెప్తావు. వాళ్ళని లోపలికి రానీ-అవతల పేసింజర్లందరికీ లేటయిపోతోంది" అన్నాడు ఇందాకటి మనిషే. ఇతన్ని ఎలక్షన్లో గెలిపిస్తే, ప్రజల కష్టసుఖాలు ప్రభుత్వానికి చక్కగా చెప్తాడని నా కనిపించింది.

"దిగండి సార్! ఎనకాల మరో బస్సొస్తోంది" అన్నాడు కండక్టరు.

"వొస్తే రానీ! నువ్వుముందు వాళ్ళని దింపెయ్. ఆడవాళ్ళకయితే ఖాళీ




వుందా? మొగవాళ్ళకి లేదూ? ఏం రూల్సయ్యా! అసల్నువ్వు మొగాడివే? వాళ్ళ నెందుకెక్కించేవూ.........'' అన్నాడు ఫుట్ బోర్డుమీద నించున్న రెండో మనిషి.

ఆడదానికి 'నువ్వు ఆడదానివి కావా?' అంటే కోపం వస్తుందో, రాదో కాని, మొగాడికిమాత్రం వెర్రి ఆవేశం తెప్పించడానికి, 'నువ్వు మొగాడివేనా?' అంటే చాలు.

కండక్టరుకి వెర్రికోపం వచ్చేసింది.

''మరియాదగా మాట్లాడండి బాబూ! అనౌసరంగ మాటలు పెంచకండి. నేను మగాణ్ణో, కానో, మీకు తెలిసేలాగ చెయ్యగల్ను......... అసల్లూ, ఆడు ఎక్కించేడు'' అంటూ బస్సు ముందుగేటు (ఆడగేటు) దగ్గరకు వెళ్ళేడు.

నేను తల అటు వేపు తిప్పేను.

''ఏటిలాటి పనికేసేవు? ఒకటే సీటు కాళీరా అన్నాను కదా! రెండు టికెట్లెందుకు ఎక్కించేవు? మా పీకల మీదికి గొప్పగా దొరికేర్రా మీరు!'' అన్నాడు అక్కడున్న క్లీనరుతో.

క్లీనరు వెకిలినవ్వోటి నవ్వి, ఇలా అన్నాడు. ''లేడీసులు ఇద్దరూ ఒకలే నండి! అందుకే, ఇద్దర్నీ ఎక్కించేను.'' అంటే...వాడి వుద్దేశం, వాళ్ళిద్దరూ వొకరికొకరు తెలియని వాళ్ళుకారూ, స్నేహితులో బంధువులోఅయుంటారూ అని. నాకు అర్థమయింది.''

వాచీ చూసుకున్నాను. సినిమాకి టైము ఎంతో లేదు 'ఆ ముగ్గురు వెధవల్నీ తోసేసి, బస్సుని పోనియ్' అనాలని నాకువుంది కాని, అన్లేదు ఎంచేతంటే, ఇన్స్టింక్టుని చంపుకుని, నాగరికతని ప్రదర్శించుకోడం నాకు బాగా అలవాటయిపోయింది.

"తమాషా వేషాలు వేసేవంటే, అసలిబస్సుని కదల్నియ్యం" అన్నాడు ఫుట్ బోర్డుమీద వాళ్ళలో వొకడు.

అటువేపు తిరిగిచూసేను. వాళ్ళలో మూడోవాడు ఏఁవీ మాట్లాడం లేదు. మిగిలిన వాళ్ళిద్దరూ, బస్సులోని వాళ్ళతో న్యాయం, ధర్మం గురించి మాట్లాడుతూ, వాళ్ళ 'లిప్ సింపతీ' పొందుతున్నారు

"వోయ్, కండక్టరూ! తప్పుమీది. కాళీ లేదన్నప్పుడు ఎక్కించడం మీ పొరపాటు. పోనీ, వీళ్ళనీ ఎక్కించై-' అన్నాడు ఇందాకటాయన-ముల్లుని ముల్లుతో తియ్యమన్నట్టు, తప్పుని తప్పుతో సరిదిద్దుకోమని.

~~నాకు, ఆ ఫుట్ బోర్డుమీద వున్న~~ వాళ్ళలో ఆ ఇద్దరి పట్టుదలా చూస్తూ వుంటే, ఈ బస్సుదిగి ఇంటికిపోతే మంచిదనిపించింది.

కండక్టరు వాళ్ళని మరోసారి బ్రతిమాలేడు భల్లూకాల్లా వున్నారు వాళ్ళు. "వాళ్ళని దింపించు. మేం దిగుతాం" అన్నారు వాళ్ళిద్దరూ. మూడోవాడు మాత్రం ఏఁవీ అన్లేదు.

భల్లూకం గాళ్ళ నిద్దరినీ మరి వొప్పించలేక, ఆఖరికి ఆడగేటు దగ్గరకు వెళ్ళి, ఆ స్త్రీలను బ్రతిమాలేడు- వాళ్లు కొంతసేపటివరకూ కదల్లేదు 'ఇంక వీళ్ళతో కొంత తగువులాట కాబోలు, ఇవాళ సినిమా చూసినట్టే!' అనుకున్నాను నేను.

కాని వాళ్ళు దిగిపోయేరు. వాళ్ళ వేపు చూడ్డానికి నాకు సిగ్గేసింది. చూడలేదు.

భల్లూకంగాళ్లూ దిగిపోయేరు. వాళ్ళ ముఖం చూడ్డానికి నాకు అసహ్యం వేసింది అంచేత చూడలేదు

బస్సుబాడీమీద, విజయ దుందుభులు రెండు మోగించేడు క్లీనరు

పూలరథంలా బస్సు కదిలింది

నేను తల లోపలికి పెట్టుకోబోతూ పక్కకి తిరిగి చూసేను.

ఇందాక, ఫుట్ బోర్డుమీద నించున్న వాళ్ళలో మూడోవాడు - పరుగెత్తుకుంటూవచ్చి, బస్సు ఎక్కిపోయాడు